# మారిన ధోరణి

## బి.వి. రమణారావు

కొత్త అన్యోన్యంగా అనురాగంగా కనబడ్డ దంపతు లెక్కడైనా కంటబడితే ఒకళ్ళకి తెలియకుండా ఒకళ్ళం, మా ఆవిడా నేనూ వాళ్ళ అదృష్టాన్ని మెచ్చుకుంటూ అసూయపడుతూవుండటం యీ మధ్య పరిపాటయిపోయింది. ఇంతకీ మా యిద్దరిమధ్యా పొత్తు చెడటానికి కారణం మా ఆవిడ మొండితన మేనని నా నమ్మకం; కేవలం నా మొండితన మేనని మాఆవిడ వాదన. అందులోనూ ఈమధ్యే మా అమ్మాయి పెళ్ళయిన దగ్గర్నుంచీ మరీ మా యిద్దరివీ ఎడమొహం పెడమొహం అయ్యేయి. దానికి కారణ మేమిటంటే—మా ఆవిడ బంధువర్గంలో మా అమ్మాయికి ఈడయిన పెళ్ళికొడుకులు కౌరవసైన్యంలాగ లెఖ్ఖకి మించినంతమంది వున్నప్పటికీ--మా అమ్మాయి మాఅక్కయ్య కొడుకుని పెళ్ళాడటం, ఇంతకీ ఇదంతా నేనూ, మా అమ్మాయీ, మా అబ్బాయికలిసి తనని అవమానం చెయ్యడానికి పన్నినకుట్రని దాని అభిప్రాయం. కాదు మొర్రోమని నచ్చచెప్పటానికి ప్రయత్నించడం—చెవిటివాడిముందర లతామంగేష్కర్ రికార్ లాంటిది.

అక్కడ కదలావుండగా మావాడికి పాతికేళ్ళొచ్చాయి. చదువు పూర్తయ్యింది. ఏమాటకామాటే చెప్పుకోవాలి. మావాడు చదువులో ఫేలయిన సంవత్సరాలకంటే ప్యాసయిన సంవత్సరాలే ఎక్కువ. ఉద్యోగంకూడా వెతగక్కర్లేకుండానే వాడు తెలుసున్నకంపెనీలో దొరికింది. సంవత్సరంగా నేనూ మా ఆవిడా ఒకళ్ళకి తెలియకుండా ఒకళ్ళం మావాడికి పెళ్ళిసంబంధాలు చూపెడుతున్నాం. వాడికి నచ్చటం లేదు. చివరికి నిలదీసి అడుగుతే తను ప్రేమ వివాహం చేసుకుంటానన్నాడు. సరే అదేదో త్వరగా కానిమ్మను. నిజానికి నాకు భావస్వతంత్రం మీద నమ్మకం ఎక్కువ. నా ముప్ఫైఏళ్ళ దాంపత్య జీవితానుభవంవల్ల ననండి, ఈ పదిహేనేళ్ళనుంచీ చూస్తున్న సినీమాలవల్ల ననుకోండి ఈ ప్రేమ వివాహాలమీద నాకూ నమ్మకం కుదిరింది. ప్రేమించడం నేర్చుకోడానికి ఒక్క సినీమా చూస్తే చాలు. అలాంటిది సినీమాపండితుడయిన మా అబ్బాయికీ బ్రహ్మవిద్య ఏనాడో కరతలామలకమయి వుండాలి. అదీకాక ప్రేమించడమంటే అంతకష్టమయిన పనేమీలాగ కనబడటం లేదు. ఇంట్లో అయితే మంచాలుచుట్టూనో, సోఫాలు చుట్టూనో, తోటలో అయితే చెట్లచుట్టూ పుట్లచుట్టూ అబ్బాయి అమ్మాయి కలిసి పరుగులెత్తడం, చేతనయితే పాటలుపాడటం. తర్వాత విరహంతోటి కమ్మరికొలిమిలాగ బుసుబుస్సుమంటూ నిట్టూర్చటం. పైగా ఈ ప్రేమకి సమయం కాని స్థలం కాని నిర్ణయం లేదు. వాళ్ళివాళ్ళి అభిరుచుల్నిపట్టి అవకాశాల్నిపట్టి పగలుగాని, రాత్రికాని, రోడ్డుమీదకాని, కాలేజీ కాంపౌండులోకాని, రైల్లోకాని, బస్సులోకాని 'పడవలోకాని-ఎక్కడయినా యీ ఘట్టాన్ని ఆరంభించవచ్చు. తర్వాత అబ్బాయి తరఫునో అమ్మాయి తరఫునో తల్లీ తండ్రీ అడ్డం పెట్టడం, చివరిఘట్టంలో ఇలా అడ్డంపెట్టినందుకు లెంపలేసుకుని వాళ్ళ పెళ్ళికి ఒప్పుకోవడం సినీమాల్లో చూస్తూనేవున్నాం. అంచేత నేను అడ్డుపెట్టదలుచుకోలేదు లెంపలేసుకోదలుచుకోలేదు. మా వాడిష్టమొచ్చినపిల్లని పెళ్ళాడమన్నాను.

ఆమధ్య మావాడు నాలుగురోజులు శెలవు దొరికితే యింటికొచ్చేడు. మొదటిరోజున మా ఆవిడ మేనరికాన్ని గురించి నూరిపోసింది. రెండోరోజున భోజనం చేసుంటే 'నేను జలజనే అమ్మాయిని పెళ్ళాడటానికి నిశ్చయించుకున్నాను" అన్నాడు.

"ఎవరూ! జలగా?" అంది మా ఆవిడ. 'జలజ'న్న మాట ఆవిడ సాహిత్య పరిధిలో లేదు.

"అబ్బే. జలజంటే...." అంటూ మావాడు తీరుబడిగా వ్యుత్పత్త్యర్థంతో సహా చెప్పేడు. ఆ అమ్మాయి బి. యే. చదువుతుందిట. చాలా అభ్యుదయ భావాలు కలదిట. పైగా మంచి ఉపన్యాసకురాలుట కూడాను. ధోరణి అంతా చూస్తే చాలా ఘాటుగా ప్రేమించినట్టుగా కూడా కనబడుతున్నాడు.

"అంత మువ్వ పిల్లని వెతుక్కుని పెళ్ళాడవల్సిన ఖర్మమే మొచ్చిందిరా!" అంటూ గడ్డం మీద వేళ్ళెట్టుకుని దీర్ఘం తీసింది మా ఆవిడ. మళ్ళీ వేళ్ళు తీసేటప్పటికి గడ్డమంతా మసితో వున్న వేలుముద్రలు.

"ఆ అమ్మాయిని ప్రేమించేను" అన్నాడు మావాడు.

"అంత ముక్కూ మొహం ఎరగని పిల్లని ప్రేమించకపోతే... పెద్ద మామయ్య కూతుర్నో చిన్న మామయ్య కూతుర్నో నా మాట విని ప్రేమించరా" అని ప్రాధేయపడింది.

"ఒకమ్మాయిని ప్రేమించిన హృదయంతో మరో అమ్మాయిని ప్రేమించడం కుదరదో" అన్నాడు మావాడు, ప్రేమతత్త్వాన్ని దాని తాలూకు సిద్ధాంతాల్ని విశదీకరిస్తూ.

"ప్రేమించడమంటే!" అంది ఈసారి ఆ మసి వేళ్ళు బుగ్గలమీద పెట్టుకుని! నిజానికి


అనేక సంవత్సరముల అనుభవముతో నవీన పద్ధతులలో మాచే తయారుచేయబడిన యినుపపెట్టెలు, ఉక్కు బీరువాలు, క్యాష్ బాక్సులు, మరియు ఆఫీసు రాకులు సరసమైన ధరలకు సకాలములో తయారుచేసి యివ్వగలము.
ఆంధ్రదేశపు ఈ పరిశ్రమను ప్రోత్సహించండి.
**ఆంధ్ర సేఫ్ కంపెని,**
షోరూము: సరస్వతీటాకీస్ రోడ్, విజయవాడ-1.
వర్కుషాపు: మునిసిపల్ ఆఫీసురోడ్, విజయవాడ-1.

సినీమాలు చూడకపోవడం వల్ల కలిగిన చిక్కయిది.

మాఆవిడ భయపడ్డట్టు ప్రేమించడమంటే అంత చెయ్యి దాటిపోయిన దారుణ వ్యవహారమేమీ కాదని చెప్పే వుద్దేశ్యంతో "అబ్బే... ప్రేమించడమంటే...ఏమీ లేదు. అదే...సినీమాల్లో లాగ...ఉత్తి ప్రేమించడం" అన్నాను. అసలే ఆ 'ప్రేమ'ని నిర్వచించడం మహాకష్టం. పైగా విశ్వరూపంలా కనబడుతుంది మా ఆవిడ మొహం మీద మసి. దాంతో అసలే మాటలు తడబడ్డాయి.

"అలాగా!" అంది మాఆవిడ... ఇది కూడా నా పన్నాగమే అన్నట్టు మనస్సులో వ్యాఖ్యానం చేసుకుంటూ. దాంతోటి మూడు రోజులుగా మా ఆవిడతో రాజీ చేసుకుందామని చేస్తున్న నా ప్రయత్నాలన్నీ గంగపాలయ్యాయి.

* * *

మహేశం యీ వూరొచ్చి రెండేళ్ళయింది. క్లబ్‌లో కలుసుకోవడం తప్ప వాడింటికెప్పుడూ వెళ్ళలేదు. సాయంత్రం షికారుగా బయులుదేరి అంత శ్రమపడి వెళ్ళిందాకా వుండి వాడింట్లో లేడు. తిరుగు మొహం పట్టి రెండు ఫర్లాంగులు నడిచేటప్పటికి చినుకులు ప్రారంభించేయి. కనుచూపుమేరలో రిక్షా కనడబలేదు. వర్షం ఎక్కువయ్యే సూచనలు కనబడుతున్నాయి. ఖాళీగా వరండా వున్న బిల్డింగు కనబడింది. పెద్ద బోర్డు కూడా కట్టివుంది. అదేదో ఆఫీసయి వుంటుందని గబగబ మెట్లెక్కుతున్నాను. అప్పుడే వర్షం ఎక్కువవ్వడం, వరండా మీదికి తెరుచుకున్న తలుపులు భళ్ళున మూయబడటం జరిగేయి. వరండాలోకి వెళ్ళగానే లోపల్నించి కోలాహలం వినబడుతుంది. వరండాలో గోడకి తగిలించిన నోటీసుబోర్డు చూశాను. "నీరా విజ్ఞాన..." అని కనబడింది. కొంపతీసి నీరా తాగితే విజ్ఞానం వస్తుందని కూడా ప్రచారం చేస్తున్నారేమిటి చెప్మా అని సందేహం కలిగి, పైగా ఈ నీరా కేంద్రంలో దూరబడినందుకు ఎవరయినా చూస్తే ఏమనుకుంటారోనని హడలిపోతూ జేబులోంచి కళ్ళజోడు తీసి తగిలించి మళ్ళీ చదివేను. అది కేవలం నా చత్వార దోషమే కాదు అక్షరాల పొందిక దోషం కూడాను.

ఇదిగో ఈ అక్షరాలు అష్టవంకర్లగానూ రాయడం ఒక పెద్దకళయిపోయింది. మొన్న మా అవధాన్లు గారు చెబితే విన్నాను. గోదావరిలో స్నానంచేసి ఆలయం వీధిలో సత్రం వుందని విని ఆ వీథమ్మటే ప్రతీ బోర్డువైపూ చూసుకుంటూ వెళ్ళేరుట. ఏవో నిలువు, గీతలతోటి లతలతోటి చెక్కిన అక్షరాలు ఓ బోర్డుమీద కనబడ్డాయిట. కష్టంమీద ఆఖరి నాలుగక్షరాలూ 'ధర్మశాల'అనిపోల్చుకుని తలుపు తోసుకుని లోపలికెళ్ళి వెంట్రు

కలు మీదపడకుండా
తల ప్రాణంతోకకి వచ్చిం
ఆ గూఢలిపి ఏమిటా అని
కర్మశాల'ని తేలింది. ఇంతకీ
నారీ విజ్ఞాన సమితి. ఆలో
జరుగుతుందని నోటీసు. క
వున్నాయి. అన్నీ విపులం
కళ్ళజోడు సర్దుకుంటుం
అని ఓ ఆడగొంతుక వి
బయటకా అని సందేహం



[illegible]గేను. మధ్య వయస్సులో వున్న ఒకావిడ వినయ పూర్వకంగా "క్షమించాలి వర్షం వల్ల మాలాన్ని తలుపులు మూసేశాం... ఇలా లోపలికి దయచెయ్యండి" అంటూ లోపలికి ఆహ్వానించింది.

హాలంతా ఆడవాళ్ళతో కిక్కిరిసి పోయి వుంది. అసలే ఆడాళ్ళంటే నాకు కొంచెం అదో లాగుంటుంది. అందులోనూ చదువు కున్న వాళ్ళంటే మరీను. పైగా ఉపన్యాసా లిచ్చే వాళ్ళనడంతో టీ ముచ్చెమటలూ పోశాయి. హాల్లో ఒక్క మూల మాత్రం మొగాళ్ళకోసం లాగుంది ఓ డజను కుర్చీ లున్నాయి. నేనెళ్ళేటప్పడికింకా రెండు మూడు కుర్చీలు ఖాళీవున్నాయి. ఎందులో కూర్చోటమా అని తటపటాయిస్తుంటే మునిసిపల్ ఛైర్మన్ పద్మనాభం వాలార్పి పట్టుకు లాగి తనపక్క కుర్చీలో కూలేశాడు. బుజం మీద ఎవరిదా చెయ్యిపడిందని వెనక్కి తిరిగ చూసేరికి బైర్డ్ పోలీసు సూపర్నెంట్ రాఘవ రావు. ఈ సభికి హాజరయ్యే అదృష్టం నా వొక్కడికే కాదని హృదయం దిట్టపరుచు కుని కూర్చున్నాను. సభావేదికమీద ఓ అమ్మాయి ఏదో మహా ఆవేశంలో ఉప న్యాసం యిస్తూంది. క్షణంలో అందరిలాగే నేనూ కొయ్యబారిపోయి గుడ్లప్పగించి చెవులు రిక్కపొడుచుకుని వినడం మొదలెట్టేను.

"ఒక్కసారి ప్రపంచ జనాభాలెక్కల మీదికి మీదృష్టి మళ్ళించండి. ఈనాడు ప్రపంచంలో పురుషుల జనసంఖ్యకంటే స్త్రీలే ఎక్కువ. అయినప్పటికీ సమాజంలో



ఉన్నతస్థానం అధిష్ఠించింది పురుషులు. టికీనూ కోటికీ ఒకళ్ళిద్దరు స్త్రీలు తప్పిస్తే చదువుకున్న వాళ్లు పురుషులు, ఉద్యోగాలు చేసేవాళ్లు పురుషులు, సంఘ సంస్కర్తలు పురుషులు, మత బోధకులు పురుషులు, కళారాధకులు పురుషులు, జాతీయ నాయకులు పురుషులు, దేశపాలకులు పురుషులు...ఇక ఈ స్వార్థపరులైన పురుషులు మనకి బోధించే దేమిటంటే... పతియే దైవం, ఇల్లేస్వర్గం, పిల్లలే మోక్షం. వయోజన ఎన్నికపద్ధతి అమలులోవున్న యీనాడు మన స్త్రీలందరూ నడుంకట్టి ఎలక్షన్లలో పురుషులతో పోటీ చేసే రాజ్య సభలో కాని లోక్ సభలో కాని ఒక్క పురుషుడికి స్థాన ముండువా!..."

ఇలా మెషీన్ గన్‌లాగ చెవులూ తద్వారా మాహృదయాలూ తూట్లు పడేలాగ ఏకధాటిగా యిస్తున్న ఆ ఉపన్యాసానికి సభామధ్యంనుంచి కెవ్వుమంటూ ఆలాపించడం మొదలెట్టిన చంటిపిలాడి ఏడుపు సడన్ బ్రేక్ వేసింది. కాస్తంత ఊపిరి తిరిగింది కదా అని సంతోషించి "ఎవరా అమ్మాయి...ఏమా కథ?" అన్న క్వొశ్చెన్ మార్కు మొహంతో పద్మనాభాన్ని గోకేను. "ఆ అమ్మాయిపేరు జలజట" అన్నాడు "జరదా" అని పెట్టుకోవల్సింది అన్నాడు పోలీసు సూపర్నెంట్ రఘవరావు. ఈ అమ్మాయే మా కాబోయే కోడలన్న విషయం జ్ఞాపకం రాగానే ఎవరో వెన్ను మీద తన్నినట్టయ్యింది.

ఇంకా ఆపసివాడు ఏడుపు మానలేదు. ఆయేడుపు మాన్పడానికి అవలంబించవల్సిన కార్యక్రమం యిదమిద్ధమని తేలలేదు. కేదలం సలహాల రూపంలోనే వుంది. ఎత్తుకోమని కొందరూ, మంచినీళ్ళిమ్మని కొందరూ,

# ★ మారిన ధోరణి ★

పిప్పర్మెంటిమ్మని కొందరూ, కాస్త బయటికి తీసుకెళ్ళి చల్లగాలిలో తిప్పమని కొందరూ. మా పక్కనున్న వరస బెంచీలో లేడీ డాక్టర్ లాగుంది అమెరికాలో పిల్లాళ్ళ పసిగుడ్డును సభలూ మీటింగుల్లో విడవకుండా ఎలా తర్ఫీదిస్తారో పక్కనున్న వాళ్ళందరికీ బతిమాలి చెబుతూంది.


చంటిపిలాడి ఏడ్పు స్థాయి మాత్రం హెచ్చింది కాని తగ్గలేదు. ఉపన్యాసకురాలు గత్యంతరం లేక కూర్చుంది. సభాసదుల సహనం సన్నగిల్లింది. పిల్లాడి నోట్లో గుడ్డలు కుక్కమనడమూ, పీక నులిమెయ్యమనడమూ అన్నంత అనురాగంతో అందరూ ఆ తల్లీ పిల్లాడికేసి చూడటం మొదలెట్టారు. ఓమూల నిట్టూర్పులతో హాలంతా ప్రతిధ్వనిస్తుంటే ఆ చంటిపిల్లాడి ఏడుపు అంటురోగంలాగ వ్యాపించి మూలమూలల్నుంచీ పిల్లకూతలు వినబడటం ఆరంభించేయి. ఇదే సమయమనుకుని మేం బయటపడ్డాం.

"ప్రతీ మీటింగూ ఇలాగే వుంటుందేమో!" అన్నాను.

"ఇకమీదట జరగబోయే రాజ్యసభలకీ, లోక్ సభలకీ నమూనా" అన్నాడు పద్మనాభం.

"నీ కేమయినా ప్రత్యేక ఆహ్వానం వచ్చిందా? నువ్వూ మాలాగే వర్షానికి కొట్టుకొచ్చేవా?" అన్నాడు రాఘవరావు వాళ్ళని గురించి నాకు కల్గిన అనుమానాన్ని పటాపంచలు చేస్తూ.

ఇంతలోకే ఎక్కడనుంచి ఊడిపడ్డాడో మహేశం హాల్లోంచివచ్చి చప్పటుకొట్టి మమ్మల్ని ఆపి "అప్పుడే వెళ్ళిపోతున్నారే!.. మా అమ్మాయి ఉపన్యాసం పూర్తిగా వినకుండా!" అన్నాడు.




"మీ అమ్మాయా!" అన్నాడు రాఘవరావు పూర్వపుటలవాటు ప్రకారం రివాల్వర్ కోసం మొల తడుముకుంటూ.

"ఎలావుంది ఉపన్యాసం?" అంటూ పద్మనాభాన్ని పలకరించేడు.

"ఝంఝామారుతంలాగుంది... ఇంతకీ కేవలం ఉపన్యాసాలివ్వడమేనా... కాస్తంత మల్లయుద్ధం కూడా నేర్పించేవా!" అని అడిగేడు పద్మనాభం.

నా ప్రశంసకోసం మహేశం నావైపు తిరగ్గానే "బ్రహ్మాండంగా వుందిరా నీ తర్ఫీదు" అన్నాను మధ్య నా కొంపమీదకి తెచ్చినందుకు మనస్సులోనే వాడిమీద శాపనార్థా లెట్టుకుంటూ.

"పిల్లల్ని పెంచడం నాదో ప్రత్యేకత... వాళ్ళ వాళ్ళ మనస్తత్వాల్ని పటి సహజమైన భావసంపత్తినిపట్టి......" ఇంకా ఏదో మహేశం వాగబోతున్నాడు.

"ఏడిశావు కాని...వెర్రివెర్రి వేషాలెయ్యక త్వరగా పెళ్ళిచెయ్యి. ఇలాంటి సీమటపాకాయి ఉపన్యాసాలు ఇంతటితో మాన్పించకపోతే తర్వాత పెళ్ళి కూడా అవ్వదు" అన్నాడు రాఘవరావు.

"ఆ విషయంలో మా అమ్మాయిని గురించి నాకు బెంగలేదు... పెళ్ళికూడా త్వరలోనే నిశ్చయం కాబోతూంది."

"సంబంధం సిరపరచేవా?"

"మాఅమ్మాయే ఎవణ్ణో ప్రేమించిందట."

"మరి వాడు మీ అమ్మాయిని ప్రేమించక్కర్లేదూ?"

"ప్రేమించేడట".

"అయితే ఈ దేశంవాడయి వుండడు. ఏ రష్యన్ రెడార్మీ సోల్జరో సర్కస్ పహిల్వానో అయివుండాలి."

"అచ్చే మనదేశంవాడూ మన రాష్ట్రం వాడూ...మనవూరివాడూట కూడాను."

"పాపం! ఎవరబ్బాయి!" అన్నాడు రాఘవరావు. నా ప్రాణం చివుక్కుమంది.

"ఎం. ఎ. ప్యాసయ్యేడుట. బెజవాడలో ఏదో కంపెనీలో పనిచేస్తున్నాడుట."

"మరింకెందుకు ఆలస్యం?"

"మా అమ్మాయి కొన్ని షరతులు పెట్టిందిట."

"ఏమిట్రోయ్!" అన్నాను.

"మా అమ్మాయికి పెళ్ళయిన తర్వాత కూడా స్వాతంత్ర్యం కావాలిట"

"అంటే...." ఓ హృదయేశ్వరీ, ఈయిల్లు నీది, ఈ గరిటెలు, ఈగిన్నెలు, ఈకుంపటి, ఈకాఫీఫిల్టరు...అన్నీ నీవే. కేవలం వంట చెయ్యడం నీకోసరదా కాబట్టీ పైగా నా మీద నీకుండే అనురాగంచేతా వంట చేస్తున్నావు కాని నువ్వు నా బానిసవు కావు. నువ్వు సర్వస్వతంత్రురాలివి" అంటూ ఉదయం సాయంత్రం వీలయితే మధ్యాహ్నం కూడా భర్త కాస్త స్తోత్రం చేస్తూవుండాలి" అంటూ వ్యాఖ్యానం చేశాడు రాఘవరావు.

"మరి పెళ్ళయినతరువాత కూడా నారీ అభ్యుదయానికి సేవ చెయ్యడానికి మీటింగులకీ క్లబ్బులకీ వెళ్ళటానికి అభ్యంతర పెట్టకూడదట."

"భేష్! అంటే పార్ట్ టైమ్ వైఫ్ గా వుంటుందన్నమాట" అన్నాడు పద్మనాభం.

"మూడోది... తనకెప్పుడు బుద్ధిపుడితే అప్పుడు ఉద్యోగంలో చేరుతుందిట."

"నిజానికి ఉద్యోగం చేస్తే ప్రతీ ఆడదానికీ తిక్క కుదురుతుంది. ఒక్క మొగుడుతో వేగలేక ఉద్యోగంలో చేరి ఆడది నూట తొంభయి మొగుళ్లుండే వుద్యోగాల్లో చేరి సెకుకొచ్చి దెమిటి!" అంటూ విమర్శించేడు రాఘవరావు.

"నాలుగోది...కట్నం చట్టవిరుద్ధమే కాకుండా...సాంఘిక దురాచారం కాబట్టి రహస్యంగా కూడా ఏవిధమైన ధనం భర్త అర్థించకూడదు"

"ఇన్ని షరతులకి ఒప్పుకుని పెళ్లాడి సంసారం చెయ్యడంకంటే......ఆ రష్యన్ స్పుట్నిక్ యెక్కి ప్రయాణం చెయ్యడం సుఖం" అన్నాడు పద్మనాభం, పెళ్ళికొడుక్కి కలగబోయే దాంపత్యసుఖం వూహిస్తూ. అప్పటికి మహేశం ధోరణి వింటుంటే నా వొళ్ళు బోయిలర్ లాగ మండిపోతుంది. దీంతోటి నా రక్తనాళాల్లో గొంగళీ పురుగులు పాకుతున్నట్టనిపించింది...చూస్తూ చూస్తూ మా కుర్రాణ్ణి ఈ పెళ్ళి స్పుట్నిక్ ఎక్కించడమా అని.

"ఇంక అయిదో షరతు..."

"నోర్ముయ్...చూస్తాను మా అబ్బాయి మీ అమ్మాయినెలా పెళ్ళాడుతాడో... షరతులట...షరతులు" ఆవేశాను ఆవేశం పట్టలేక. తత్ఫలితంగా ఉద్భవించిన మహేశం ఆర్తనాదం, పద్మనాభం హాహాకారం, రాఘవరావు ఛీంకారంతోటే కాస్తంత బోయిలర్ చల్లబడింది. ఒణుకుతున్న చేతులతో మహేశం నా చేతులు పట్టుకునేటప్పడికి నా వొళ్ళు కూడా పూర్తిగా చల్లబడింది.

ఇంటికి తిరిగివస్తుంటే నా ఆవేశానికి నాకే నవ్వొచ్చింది. మావాడు భార్యని అదుపాజ్ఞల్లో పెట్టుకోలేకుండాపోతాడేమో ననుకోడానికి, మహేశం తన కూతురు చిలకపలుకులకి తాళం వెయ్యడానికి కారణం మాకు మా పిల్లలమీద వుండే ఆపాయ్యమే కాని యిందులో ఆవేశానికి ఆగ్రహానికి తావెక్కడుంది. అదీ కాకుండా వాళ్లిద్దరూ మోజుపడి ప్రేమించి పెళ్ళాడుకుంటాం మొర్రోమంటుంటే మధ్య కదుప

పక్షిలాగ నేనడ్డం పెటడం దేనికి! నిజానికి రాఘవరావన్నట్టు పెళ్ళియ్యేవరకూ నే కాని దానితర్వాత ప్రతీ ఆడదిగా జాలు తోడిగించుకున్న మహాపతివ్రతే. సంసార బాధ్యత మీద పడేటప్పటికి ఈ వెర్రి వెర్రి ఉపన్యాసాలూ ఈ ధోరణి పూర్తిగా మారు తుంది.

సరాసరి వంటింట్లోకెళ్ళి మా ఆవిడతో ఈ విషయాలన్నీ చెప్పి ఈ పెళ్ళిమాత్రం నాకు యిష్టం లేదని వీలయితే కుర్రాడికి నచ్చ చెప్పమని రహస్యంగా ఓ అస్త్రం సంధించేను. మా ఆవిడకి రహస్యం చెప్పడ మంటే రేడియో సిలోన్‌లో ఎడ్వర్టైజ్‌మెంట్ యివ్వడంలాంటిది కాబట్టి తక్షణం పొగలు కక్కుకుంటూ ప్రళయకాళి రూపంలో మా కుర్రాడి ఎదట నిలబడేటప్పటికి ఎందు కయినా మంచిదని గోడకి ఆనుకుని మరీ నిలబడ్డాను.

కాబోయే కోడలు వగతుళు సరిగా నేను మారిపోసిన వరసలో నే దండకంలా చదివి "వీటన్నిటికీ నువ్వు ఒప్పుగున్నావా?" అని మావాణ్ణి నిలదీసి అడగటం, దానికి వాడు టూకీగా "అవును...సినీమా కెళుతున్నాను ...రాత్రి భోజనానికి రావడం ఆలస్యం అవుతుంది...టా...టా" అంటూ అక్కణ్ణుంచి జారడం తత్ఫలితంగా నేనో అర గ్లాసుడు మంచినీళ్ళు త్రాగి మాఆవిడకో మరచెంబుడు అందించడం...ఒక్క క్షణంలో జరిగింది.

* * *

మా కుర్రాడి మేనమామలూ ఇత్యాది 'తసమదీయులు' పెళ్ళి శుభలేఖలు చూసుకుని మూర్ఛపోయారనీ, మూర్ఛ తేరినతర్వాత "అంత కట్నం యిచ్చినా చేసుకోకూడనంత సంబంధాలనుకుంటే, నా యీ దుస్సంకల్పం వాళ్ళకిముందరే తెలిసి వుంటే తాము నన్నూ తమ కూతుళ్ళు మా అబ్బాయినీ ప్రేమించి వుండకపోదుమనీ వాపోయి, ఎంతి భర్తృవాక్పరిపాలనా దీక్షా పరాయణురాలైన మహాపతివ్రతయినప్పటికీ కన్నకొడుకూ కట్టుకున్న మొగుడూ ఏక మయ్యి పాపభీతి లేకుండా, కావల్సిన సంబంధాలు కాలదన్ని కానివాళ్ళతో వియ్యమందబోతుంటే తనూ (అనగా మా ఆవిడ) తాళం వేసిందంటే దానికి ప్రతిఫలం చేసు కొనున్న కేపైననూ అనుభవించి తీరు తుంద"ని ఒక్క క్షణం ఇష్టదేవతా ప్రార్థన లేసుకున్నారనీ... కొన్ని అనధికారవర్గాల నుండి వార్తలు.

అసలు పెళ్ళి స్థిరపడిన దగ్గర్నుంచీమాఆవిడ మందహాసాలంకృతవదనంతో నిత్యరూప దర్శనమిస్తుంది. ఇక పెళ్ళిరోజున ఓఅరడజను హైడ్రోజన్ బాంబులు మింగినట్టుండి నిజ రూప దర్శన మిస్తుందని, ఏమాత్రం ఆవిడ రగుల్కున్నా 'హిరోషిమా' దృశ్యం తథ్య మనీ మా అబ్బాయికీ తద్వారా ఆడపెళ్ళి వారికీ ముందరే కబురుచేశాను. ఆరోజున ఆవిడ సమక్షంలో నిలబడినతర్వాత గాడి పొయ్యిదగిరకెళ్ళి నిలబడితే 'ఎయిర్ కండిషన్డ్ రూమ్'లో వున్నట్టుంది.

ఆ సాయంత్రానికిమాత్రం మా ఆవిడ పూర్తిగా మెత్తబడి కరుణాకిరణప్రసారం ప్రారంభించింది. ఈ మార్పుకు కారణం ఏమయి వుంటుందంటే...ఒకటి-మా అబ్బాయీ జలజా చాలా అన్యోన్యంగా సంచరించడం చూసి, ఆంతరంగికంగా మురిసి పోవడం-రెండు-ఎదిగినపిల్లలకి ఎదురుచెప్పడం కంటే ఈ వయస్సులో మౌనం వహించి వాళ్ళ మెప్పు సంపాదించడమే శ్రేయస్కరమని గ్రహించడం. వెనక మా అమ్మాయి పెళ్ళి సందర్భంలో ఓసారి అనుభవమయ్యిందికదా! ...ఇంక ముఖ్యమయిన మూడో కారణం- ఈ పెళ్ళి నాక్కూడా యిష్టం లేదని ఆవిడ నమ్మకం-తన మాట పోయినా, నామాట నెగ్గలేదని ఆవిడ సంతోషం.

* * *

పెళ్ళయి మూడు నెలలయ్యింది. మా వాడి సంసారం ఎలాగుందో చూడానికి మా ఆవిడపోరు పడలేక ప్రయాణమయ్యేం. బయలుదేరేముందర మా ఆవిడతో కొన్ని విషయాలు ఖచ్చితంగా చెప్పేను.

"వాళ్ళింట్లో మడీతడీ అంటూ సొంటూ లాంటి ఆచారాలుండవు."

"పోనీండి...నాకేం!" అంది.

"కోడలు కళ్ళకి జోడు, కాళ్ళకి జోడు, చేతికి రిస్టువాచి పెట్టుకుని తెలుగూ యింగ్లీషూ కలిపి మాట్లాడుతూ వుండొచ్చు"

"కోడలుతో మాటాడనే మాటాడను."

"మరి పెదవులకీ బుగలకీ రంగు లేసు కుంటే."

"వాళ్ళంతా రంగు పూసుకోమనండి— నాకేం!"

"వాళ్ళు టేబుల్ మీద భోజనాలు చేస్తా రనుకుంటాను."

"నెత్తిమీద పెట్టుకు తినమనండి"

"వాళ్ళు చెంచా, కత్తి, త్రిశూలంలాంటి వాటితోటి అన్నం తింటారనుకో."

"కావలిస్తే నుత్తి గొడ్డలీ కూడా ఉపయో గించుకోమంటాను."

"వాళ్ళు పొద్దున్నే పళ్ళు తోము కోకుండా బెడ్ కాఫీ తాగుతారనుకో."

"దవడ పళ్ళూడ గొడతాను."

"మధ్య నీకెందుకే....చుటం చూపుకింద ఓరోజుండి రావడాని కెళ్ళి వాళ్ళతో దెబ్బలాటెట్టుకుంటావా?"

"దెబ్బలాటెట్టుకోవడం కాదు...మీరు వర్ణించినట్టే వాళ్ళక్కడ సంసారం చేస్తూంటే...ఆ యింటికి నిప్పంటించి మరీ వస్తాను."

నాకే అనుమానం కలగకపోలేదు. మా ఆవిడ అంతటి సమర్థురాలే. నిజానికి నేను వర్ణించిన లక్షణాలన్నీ నాలో అజ్ఞాతంగా చెలరేగిన కోరికలు. మా ఆవిడ ఆచారం ధర్మమా అని అవన్నీ నాకు తీరని కోరిక లయిపోయాయి. ఆవిడ అచారం, దైవభక్తి, పతిభక్తి, (వర్కా-దానికి ఆవిడ నిఘంటువులో ప్రత్యేక నిర్వచనంవుంది)...వాటి మూలాన్నే మా సంసారం ఈ మాత్రమైనా నెట్టుకొస్తున్నామనీ లేకపోతే ఏనాడో అధఃపాతాళానికి పోయివుందుమని ఆవిడ

(57 వ పేజీ చూడండి)



# మారిన ధోరణి

(35-వ పేజీ తరువాయి)

విశ్వాసం. కాదని రుజువుచేసే అవకాశం కాని పట్టుదలకాని నాకులేవు.

* * *

మమ్మల్ని చూడగానే మా అబ్బాయి సంతోషంతో ఎలక్షన్ లౌడ్‌స్పీకర్లాగ 'జెల్లీ...అమ్మా నాన్నా వొచ్చేరు,' అని పొలికేక వేశాడు. "జెల్లీ" అంటే జలజకి ముద్దుపేరనుకుంటాను. ఇంతకీ కట్టుకున్న పెళ్ళాన్ని 'ఏమే' 'ఒసే' అనడంతప్ప పేరెట్టి పిలవడమే నేరమనుకునే సాంప్రదాయానికి చెందినవాళ్ళమవడంవల్ల ఈ 'జెల్లీ' 'జెర్రీ' ఏమిటా అని వెర్రిమొహం పెట్టి నా వైపు చూస్తున్న మాఆవిడ మొహంలోకి సూటిగా చూళ్ళేకపోయాను. మొత్తంమీద ఇది మా ఆవిడకి మొదటి 'షాక్.' కేకవిని మాకోడలు లోపల్నుంచి బయటకొచ్చేటప్పటికి నా కళ్ళు నేను నమ్మలేకపోయాను. ఈ షాక్ నావంతు. మా అబ్బాయి మొహంలోకి చూశాను జాలిగా. నిప్పుల్తొక్కిన వాడులాగ కుప్పిగంతులేస్తూ "ఇంకా పూజవ్వలేదూ! ...అయినంతవరకు వచ్చిన పుణ్యం చాలు ...ముందర కాఫీ పెట్టు" అన్నాడు. "వరలక్ష్మీపూజ చేసుకుంటున్నావా ఏమిటితల్లీ...వెళ్ళు.పూజచేసుకుంటూవుండు ఇప్పుడు కాఫీ వద్దు గీఫీ వద్దు. అన్నీ దార్లో అయ్యేయి... నేనూ స్నానంచేసి వస్తాను" అంటూ చేటంత మొహంచేసుకుని మాఆవిడ లోపలికెళ్ళింది.

తడారని జుట్టు, కాటుకకళ్ళు, పట్టుచీర, కాళ్ళకి పసుపు, పెద్ద కుంకంబొట్టూ... టూకీగా వర్ణించాలంటే అది మా కోడలు ప్రత్యేకమైన రూపం. మా వాడి కుర్చీకెదురుగావున్న కుర్చీలో చతికిలపడ్డాను. సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె, కిందపడ్డ సిగరెట్ పీకలు నాకు కనబడకుండా వుండాలనిలాగుంది, చాలా నేర్పుగా మావాడు బల్లకిందికి నెట్టేస్తున్నాడు. అటు చూడటమెందుకని ఇటొట్లోకి చూశాను. మా ఆవిడ లోపలికి రమ్మని సౌంజ్ఞ చేసి కోడలు వరలక్ష్మీపూజ చేసుకుంటుంటే అలా కూర్చుంటారేమిటి!...త్వరగా బజారు కెళ్ళి ఓ పట్టుచీర, రవిక తీసుకురండి" అని పురమాయించింది.

* * *

ఆరాత్రి డాబామీద పడుకున్నాను. పక్క మంచంమీద మాఆవిడా కోడలూ గుసగుసలాడుకుంటున్నారు. వాళ్ళ తల్లో మల్లెపూవుల సువాసనా, పెన చల్లని వెన్నెల, పక్కమీద తెల్లని దుప్పటి...మునిమాణిక్యం కథలో వర్ణన జ్ఞాపకమొస్తుంది. మా వాడు ఫస్ట్‌బెల్ కొట్టేసరికి కిందికి వెళ్ళిపోయి పడుకున్నాడు. మా ఆవిడ మాత్రం కోడలు కొంగుపట్టుకుని యింకా వేళ్ళాడుతుంది. నేను నిద్రనటిస్తూ కళ్ళు మూసుకున్నాను. కిందనుంచి రేడియోలో సిలోన్ తెలుగు ఏప్పొ్రి కార్యక్రమం వినబడుతుంది.

"మరి మీ మామగారేమన్నారో తెలుసా ..."అంటూ తన నిత్య సత్య వ్రతానికి భంగంకలగకుండా ఉన్నవి లేనివి కల్పించి... "అసలు నువ్వో దొరసాని వన్నట్టు వస్తాం చేరు" అంది మా ఆవిడ.

"అబ్బే! మన ఆచారాలూ సాంప్రదాయాలూ అంటే నాకు చాలా అభిమానం. చదువులవల్ల నేర్చుకోవల్సింది పోకులూ నాస్తికత్వంకాదు" అంది మా కోడలు. దాంతోటి మా ఆవిడ సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యేపోయి వుంటుంది.

"అసలు మేము యింటికొచ్చేటప్పటికి నువ్వు యింట్లోనే వుండవు. ఏక్లబ్బుకో పార్టీకో వెళ్ళి వుంటావన్నారు"

"అవన్నీ మొదట్లో వినోదాలుగావున్నా తర్వాత వ్యసనాలవుతాయనిక్లబ్బుకి రోజూ వెళ్ళటంలేదు. ఏవైనా విజ్ఞానదాయకమైన సభలూ సమావేశాలూ వుంటే వెడుతూంటాను" ఈ దెబ్బతో మా ఆవిడ చిత్తయిపోయివుండాలి.

"మరి ఉద్యోగం చేస్తానన్నావుట!" అంది మా ఆవిడ "స్త్రీ స్వయం పోషణా సమర్ధతకి కావల్సిన అర్హతలు సంపాదించి భర్త సంపాదన చాలని పక్షంలో ఉద్యోగంలో చేరి తనూ సంపాదించాలని నా వుద్దేశ్యం. అంచేత అవసరమైతే ఉద్యోగం చేస్తానన్నాను. నిజానికి గాంధీగారు చెప్పినట్టు గృహనిర్వహణ ఒకకళ. ఉద్యోగాల కెగబడటంకంటే ఉద్యోగం చేస్తున్న భర్తతో సహకరిస్తూ సంసారం సక్రమంగా నిర్వహించడం స్త్రీకి ముఖ్యం. దానివల్ల భార్యాభర్తలకి కలిగే తృప్తి యిద్దరూ చెరో వుద్యోగం చేసి రెట్టింపు డబ్బు సంపాదించినా రావు."

నా అంతవాణ్ణి నాకే ఆమాటలు వింటుంటే ఆనంద బాష్పాలు రాలేయికదా! యిక మా ఆవిడ విషయం వర్ణనాతీతం గాజుల గలగల్లిపట్టి ఆనంద పరవశంలో కోడల్ని కౌగలించుకుని వుంటుందని గ్రహించేను.

ఇంతలోకే సెకండ్ బెల్ చిహ్నంగా కింద రేడియో ఆగిపోయింది. మా ఆవిడ మా కోడల్ని విడవలేక విడవలేక విడిచిపెట్టింది. కోడలు వెళ్ళిపోయింది.

క్షణం నిశ్శబ్దం "ఏమండీ యీ చంద్రహారం కోడలికిచ్చేస్తున్నాను." అంది మా ఆవిడ నావైపు తిరిగి. "ఏ చంద్రహారం!" అంటూ చేత్తోస్పృశిద్దామని చెయ్యి అటు చాచేను కళ్ళు తెరిచీ ఓపిగలేక.

"చాల్లెండి...మనం తాతా అమ్మమ్మలం కాబోతున్నాం" అంది అదేదో పెద్దభావగర్భితంగా.

★




వీరు ఎట్లాదువ్వుకున్నా



మీరు ప్రక్కపాపట తీసుకున్నా, నడుమపాపట తీసుకున్నా, జారుడు జడ అల్లుకున్నా, చుట్ట చుట్టుకున్నా, లేక నిండుచంద్రుడు మాదిరిగా గుండ్రంగా ముడివేసుకున్నా—మీరు ఏ విధంగా దువ్వుకున్నా మీకు ముఖ్యంగా అవసరమైంది పుష్కలమైన అందమగు కేశసంపద. కేశవర్ధని మీకు అందమైన వెండ్రుకలను సమృద్ధిగా పెంచును

అందం అనేది భగవంతుడు ప్రసాదించే వరమే అనుకోండి. అయితే వెండ్రుకల సౌందర్యం మీరు కేశవర్ధినితో స్వయంగా కల్పించుకొని పొందవచ్చును.

మీ పడుచుదనంలోనే మీ కేశవృద్ధికి అందానికి కేశవర్ధినితో పునాదులు వేయండి దాని ప్రభావంతో బాగుపడని వెండ్రుకలు వుండవు.

కేశవర్ధని

అందమైన వెండ్రుకలను పెంచి కాపాడును

కేశవర్ధని షాంపూ

మీ వెండ్రుకలను పరిశుభ్రంగాను, సువాసనగాను, ఆరోగ్యంగాను ఉంచును.

అంజన్ (కాటుక)

మీ కన్నులు విశిష్టంగాను, ఆకర్షణీయంగాను, కండ్లజబ్బులులేకుండగనుచేయును.

తయారు చేసినవారు

కేశవర్ధని ప్రాడక్ట్సు.

కోయంబత్తూరు-1.

విశాలాంధ్ర ఏజెంట్లు :

మెసర్సు సూర్యకాంత్ అండ్ కంపెనీ,

1141, రాష్ట్రపతిరోడ్డు, సికింద్రాబాదు.

GP